# ఆలయాల అభివృద్ధికి కృషి

లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరిస్తున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి

**● ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి**

భూదాన్ పోచంపల్లి, మార్చి 20: పట్టణ కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ నెల 21 నుంచి 27 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల కరపత్రాలను బుధవారం హైదరాబాదులో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ నెల 25న జరిగే స్వామివారి తిరు కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలని కోరుతూ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంకం వినోద్, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవ కుమార్, స్థానిక వార్డు కౌన్సిలర్ మోటె రజితా రాజు, నాయకులు మోటె మహేశ్, చేరాల సుధీర్, వేషాల మురళి, కూరపాటి బాబు, వంగూరి బాలకృష్ణ, పొనమోని కావ్య, జింకల కుమార్, చేరాల శ్రీకాంత్, గోశిక శివకుమార్, చెరుకు శ్రీకాంత్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

**బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలి**

భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ అంకం వినోద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న లక్ష పుష్పార్చన, 24న గరుడ ముద్ద, 25న కల్యాణం, 26న సుదర్శన హోమం, 27న రథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

# వైభవంగా సువర్ణ పుష్పార్చన

సువర్ణ పుష్పార్చనలో భాగంగా స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, మార్చి 20: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో బుధవారం సువర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారికి భక్తులు జరిపే ఆర్జిత పూజల్లో భాగంగా ప్రధానాలయ ముఖ మండపంలో సువర్ణమూర్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణపుష్పార్చన పూజలు చేశారు. మొదటగా శ్రీమన్యుసూక్త పారాయణం చేశారు. ప్రత్యేకంగా బంగారంతో తయారు చేసిన 108 పుష్పాలను శ్రీవారి సన్నిధిలో ఉంచి అర్చించారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వయంభూ నారసింహస్వామి భక్తులకు నిజరూప దర్శనంలో దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం వేళలో స్వామి వారికి దర్బార్ సేవ, రాత్రి తిరువారాధన చేపట్టారు. సుమారు 8 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.22,98,275 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.



మిర్యాలగూడలో మిల్లు వద్ద అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

# రైతులకు మద్దతు ధర చెల్లించకుంటే మిల్లులు సీజ్ చేస్తాం

**● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

మిర్యాలగూడ/మిర్యాలగూడ రూరల్/తిప్పర్తి, మార్చి 20 : రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేసే మిల్లులను సీజ్ చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హెచ్చరించారు. మిర్యాలగూడ మండలం గూడూరులో సీతారామచంద్ర ఆంజనేయ స్వామి ఆలయం, వెంకటాద్రి పాలెంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల ప్రాంభోత్సవాల్లో ఆయన పాల్గొనేందుకు వచ్చారు. ఈ సందర్భంగా మార్గ మధ్యంలో రైస్ మిల్లుల ప్రధాన ద్వారం వద్ద ధాన్యం లోడుతో నిల్చున్న ట్రాక్టర్లను చూసి మంత్రి తన వాహనం ఆపి రైతులతో మాట్లాడారు. మిర్యాలగూడలో రైస్ మిల్లర్లు సిండికేట్ అయి తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేస్తున్నారని రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌కు ఫోన్ చేసి వెంటనే మిల్లుల వద్దకు రైతులు తీసుకొచ్చిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తే మిల్లులను సీజ్ చేయాలని ఆదేశించారు. అలాగే తిప్పర్తి మండలంలోని సిలార్‌మియాగూడెంలో నిర్మిస్తున్న రామాలయ పనులను మంత్రి కోమటిరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, నాయకులు కేతావత్ శంకర్‌నాయక్, శ్రీనివాస్, గాయం ఉపేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలి

**● సీపీఎం రాష్ట్ర నాయకుడు కొండమడుగు నర్సింహ**

కామ్రేడ్ గోపి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 20: పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. బుధవారం కామ్రేడ్ తిరందాసు గోపి వర్ధంతి సందర్భంగా పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతూ, కార్మిక హక్కులను కాలరాస్తుందన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి లావుడియా రాజు, నాయకులు రామచంద్రారెడ్డి, విష్ణు, మధు, జంగయ్య పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో మల్లన్న పండుగ

మల్లన్న పండుగలో పాల్గొన్న గొల్లకుర్మలు

రాజాపేట, మార్చి 20 : మండలంలోని జాల గ్రామంలో బుధవారం గొల్లకుర్మలు మల్లన్న పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మల్లన్న ఒగ్గు కథతో పాటు, కల్యాణం, పటం పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో తరలి వచ్చి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కార్యక్రమంలో గొల్లకుర్మ సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని మంత్రికి వినతి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధిత రైతులు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 20 : రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ బాధిత రైతులు బుధవారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు త్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని కోరారు.

వినతి పత్రం ఇచ్చిన వారిలో రైతు నాయకులు అవిశెట్టి పాండుయాదవ్, పల్లెర్ల యాదగిరి, అవిశెట్టి రమేశ్‌యాదవ్, కిట్టు యాదవ్, మధు, రమేశ్, స్వామి ఉన్నారు.

# నాయకులకు సన్మానం



నాంచారమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ సురేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

భువనగిరి సిటీ, మార్చి 20 : రాష్ట్ర ఎరుకల నాంచారమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కుతాడి సురేశ్‌ను బుధవారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అనంతరం పార్టీ మండలాధ్యక్షుడు జనగాం పాండు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సందెల సుధాకర్, తాజ్జూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు ర్యాకల శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షుడు నాగేంద్రబాబు, పుట్ట వీరేశ్‌యాదవ్, కొండల్, నాయకులు పాల్గొన్నారు.

## నర్సరీల్లో అన్ని రకాల మొక్కలు పెంచాలి

ఆత్మకూరు(ఎం) : కొరటికల్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నిరంజన్‌పలీ

ఆత్మకూరు(ఎం),మార్చి 20 : గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో అన్ని రకాల మొక్కలను పెంచాలని ఎంపీడీఓ నిరంజన్‌పలీ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని కొరటికల్ గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు.

ప్రతి రోజు మొక్కలకు నీళ్లు అందించి ఎండిపోకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఏపీఓ రమేశ్, ఈసీ శ్రీనివాస్, ఫీల్డ్‌అసిస్టెంట్ సుమలత ఉన్నారు.

## మామిడి తోట దగ్ధం

కాలిపోయిన మామిడితోటను పరిశీలిస్తున్న ఆర్ఐ మల్లిఖార్జున్‌రావు

ఆత్మకూరు(ఎం), మార్చి 20 : మండలంలోని సర్వేపల్లిలో ఉన్న కల్వకుంట్ల రామకృష్ణారెడ్డికి చెందిన ఎకరం మామిడి తోట బుధవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధిత రైతు ఫిర్యాధు మేరకు ఆర్ఐ మల్లిఖార్జున్ రావు ఘటనాస్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు.

## పారిశుధ్య కార్మికుల వేతనాలు విడుదల చేయాలి



దవాఖాన సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

రామన్నపేట, మార్చి20: దవాఖానలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. బుధవారం మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రామన్నపేట ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ వరన్నకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దవాఖానలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మూడు నెలల నుంచి వేతనాలు అందక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికులకు రూ.15600 వేతనం అందించాల్సి ఉండగా ఏజన్సీ నిర్వాహకుడు రూ.11050 మాత్రమే చెల్లిస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గొరిగె సోములు, జిల్లా కమిటీ సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశం, బందెల భిక్షం, కార్మికులు భీంపాక నాగేశ్వర్, నారపాక రాజ్‌కుమార్, గాదె యాదమ్మ, శేఖర్, భీంపాక ప్రశాంత్, ఎల్లమ్మ పాల్గొన్నారు.

# పిచ్చుకల దినోత్సవం

పిచ్చుకలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

చౌటుప్పల్, మార్చి 20 : పట్టణ కేంద్రంలోని ట్రినిటీ పాఠశాలలో బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పిచ్చుకలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేసవిలో నీటి కోసం అల్లాడుతున్న పిచ్చలకు నీటిని అందించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల, చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యాదవ సామాజిక వర్గానికి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి

**● శ్రీ కృష్ణ యాదవసంఘం జిల్లా అధ్యక్షుడు వీరేశ్‌యాదవ్**

భువనగిరి కలెక్టరేట్, మార్చి 20 : జనాభా ప్రాతిపదికన యాదవ సామాజిక వర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలని శ్రీకృష్ణ యాదవసంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేశ్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యాదవులకు మంత్రి పదవితో పాటుగా, రెండు లోక్‌సభ, రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 37 కార్పొరేషన్లకు చైర్మన్లలో ఒక్క యాదవ నాయకుడి పేరు లేకపోవడం దుర్మార్గమన్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లోనూ సముచిత స్థానం కల్పించాలన్నారు. లేని పక్షంలో రానున్న ఎన్నికల్లో తమ సత్తా చూపుతామని హెచ్చరించారు.

## గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

బీబీనగర్, మార్చి 20 : బీబీనగర్ మండల కేంద్రంలో రైల్వే ట్రాక్‌పై 227/3-5 మైలు రాయి వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని బుధవారం రైల్వే పోలీసులు గుర్తించారు. మహిళ వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొని ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నం. 8712568454, 9100742260కు సమాచారం అందించాలని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

## బీజేవైఎం మండల అధ్యక్షుడిగా జగదీశ్ యాదవ్

భూదాన్ పోచంపల్లి, మార్చి 20 : బీజేవైఎం మండలాధ్యక్షుడిగా ఉప్పునూతల జగదీశ్ యాదవ్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు.

## ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం),మార్చి20 : మండల కేంద్రానికి చెందిన బత్తిని మల్లేశంగౌడ్ సంవత్సర కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడి వైద్య ఖర్చుల కోసం మైసమ్మగుంటి గౌడ యూత్ ఆధ్వర్యంలో బుధవారం రూ.10వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో గీతపారిశ్రామిక సహకారసంఘం అధ్యక్షుడు పంజాల నర్సయ్య గౌడ్, నర్సింహ, మత్స్యగిరి, శ్రీకాంత్, గణేశ్, మల్లిఖార్జున్, సతీశ్, వెంకన్న, సాయిరాం, సాయికుమార్ పాల్గొన్నారు.

## దత్తప్పగూడెంలో..

మోత్కూరు : మండలంలోని దత్తప్పగూడేనికి చెందిన యువకుడు ముక్కెర్ల కృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అతడికి పంపించిన రూ.10వేల ఆర్థిక సాయాన్ని బుధవారం కాంగ్రెస్ నాయకులు యువకుడికి అందించారు. కార్యక్రమంలో నాయకులు ఎలుగు యాదయ్య, మాజీ ఎంపీటీసీ ఎలుగు పార్వతమ్మ, చింత చంద్రయ్య, వల్లందాసు వెంకన్న పాల్గొన్నారు.

## రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

**● ఏడుగురికి గాయాలు**

భువనగిరి కలెక్టరేట్, మార్చి 20 : మండలంలోని వడపర్తి గ్రామంలో బుధవారం రెండు కుటుంబాలకు చెందిన వారు ఘర్షణ పడగా ఏడుగురికి గాయాయ్యాయి. రూరల్ ఎస్ఐ వి. సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వడపర్తి గ్రామానికి చెందిన మేడబోయిన సత్తయ్య పశువులు అదే గ్రామానికి చెందిన ఎలిమినేటి పద్మారెడ్డి వరి చేలో మేస్తుండటంతో పద్మారెడ్డి ధూషణలకు దిగాడు. దాంతో సత్తయ్య, పద్మారెడ్డితో పాటు వారి భార్యలు, కొడుకులు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో సత్తయ్య, అతడి కుమారులు బాలమల్లేశ్, గోపాలకృష్ణ, పద్మారెడ్డితో పాటు అతడి భార్య కళమ్మ, కుమారుడు సంతోష్‌రెడ్డి గాయపడ్డారు. పోలీసులు గ్రామానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

యాదగిరిగుట్ట, మార్చి 20 : బైక్ డివైడర్‌ను ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన యాదగిరిగుట్ట పట్టణంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరికి చెందిన కుసందుల శివ(20) బైక్‌పై గుట్టకు వస్తూ గుండ్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీ కొట్టాడు. దాంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో భువనగిరి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి : కలెక్టర్ వెంకట్రావ్

మీడియా సెంటర్ ప్రారంభించి పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట, మార్చి 20 : పార్లమెంట్ ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు మీడియా సహకారం ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నా రు. సూర్యాపేట కలెక్టరేట్‌లో బుధవారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మీడియా సెంటర్‌ను ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు అందించాల్సిన బాధ్యత అధికారులకు ఉందన్నారు. ఎంపీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తిస్తారని, వాటిని నిర్ధారణ చేస్తూ సంబంధిత అధికారి అభ్యర్థి ఖర్చులో వేస్తారని తెలిపారు. సోషల్ మీడియాలో రాజకీయ పార్టీల ప్రకటనలు సకాలంలో ఆమోదించాలని అధికారులకు సూచించారు. శాటిలైట్ చానెల్స్‌లో వచ్చే వార్తలను పూర్తి స్థాయిలో రికార్డు చేయాలని ఆదేశించారు. వార్తా పత్రికలు, ఈ-పేపర్‌లు, టెలివిజన్ చానెల్‌లు, స్థానిక కేబుల్ నెట్‌వర్క్‌లు, సోషల్ మీడియా, మూవీ హౌస్‌లు, సంక్షిప్త సందేశాలు, ఆడియో, వీడియో విజువల్ మీడియాల ప్రకటనలను ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సాధించాలని అధికారులకు సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, ప్రకటనలు ప్రసారం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

**పటిష్ట నిఘా పెట్టాలి**

అనంతరం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే పాల్గొని మాట్లాడారు. జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల్లో నిఘా పెంచాలని, డిజిటల్, బ్యాంకు లావాదేవీలు బ్యాంకర్లు దృష్టి పెట్టాని తెలిపారు. బ్యాంకు అధికారులు ప్రతి రోజూ నివేదికలు అందచేయాలని, తనిఖీల సందర్భంగా పట్టుకున్న నగదుకు రసీదులను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్రమంగా రవాణా చేస్తే లిక్కర్‌తోపాటు ఇతర మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, జడ్పీ సీఈఓ అప్పారావు, డీపీఆర్ఓ రమేశ్‌కుమార్, ఎక్సైజ్ పర్యవేక్షకులు లక్ష్మనాయక్, డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, డీఐఈ మల్లేశం, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస రాజు పాల్గొన్నారు.

# 29న తై బజార్ బహిరంగ వేలం

భువనగిరి అర్బన్, మార్చి 20 : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ తై-బజార్ వసూలు చేసేందుకు ఈ నెల 29న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తులిపారు. వేలంలో పాల్గొన దలచుకున్న వారు రూ.2వేలు చెల్లించి దరఖాస్తు తీసుకోవాలని, రూ.2.5 లక్షల డీడీని ధరావత్తుగా సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాని సూచించారు. వేలం పురపాలక సంఘం కార్యాలయములో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఆందోళ్ మైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు

చౌటుప్పల్ రూరల్, మార్చి 20 : మండలంలోని దండు మల్కాపురం గ్రామ పరిధిలోని ఆందోళ్ మైసమ్మ ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మహేందర్‌కుమార్ పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు. 43 రోజులకు రూ.4,26,275 ఆదాయం సమకూరినట్లు దేవాలయ ఈఓ మోహన్‌బాబు తెలిపారు.

## ఓటు నమోదుపై అవగాహన

ఆలేరురూరల్, మార్చి 20 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఆలేరు మండల సమాఖ్య సమావేశంలో ఓటు హక్కు వినియోగంపై అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీవో సత్యానంద్ ప్రసాద్ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు, స్కూల్ యూ నిఫామ్ తయారీపై సభ్యులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఏపీఎం మీనా, సీసీలు సరస్వతి, శివకుమార్ పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

వలిగొండ, మార్చి 20: గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఎం.తుర్కపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎం. తుర్కపల్లి గ్రామానికి చెందిన సింగనబోయిన నర్సింహ(58) మద్యానికి బానిసయ్యాడు. జీవితం మీద విరక్తితో చెన్నచెరువు సమీపంలో గడ్డి మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృత దేహానికి పంచనామ నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.